క్లుప్తంగా

తెలంగాణ తల్లి విగ్రహం ముస్తాబు

ఇల్లెందు: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఇల్లెందులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం ముస్తాబు ఏర్పాట్లను బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ సందర్శించి పరిశీలించారు. పట్టణంలోని జగదాంబా సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీలకు అతీతంగా పూలమాలలు వేయనున్నారు. ఇందుకోసం రంగులు అద్ది క్షీరాభిషేకం చేసి సుందరీకరించారు.

విద్యార్థినికి ఎంపీ వద్దిరాజు సత్కారం



శార్వాణిని సన్మానిస్తున్న ఎంపీ వద్దిరాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం) కొత్తగూడెం రామవరం 2 ఇంక్‌లైన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన తమ్మిశెట్టి అశోక్, నాగమణి దంపతుల కుమార్తె శార్వాణి ఇంటర్మీడియట్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం పరీక్షలలో 460/470 మార్కులు సాధించింది. ఈ మేరకు ఆదివారం ఖమ్మంలో ఎంపీ వద్దిరాజును విద్యానగర్ వార్డు సభ్యులు గజ్జెల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ శార్వాణిని సత్కరించారు.

కొత్తగూడెం ఏరియాలో ఉత్తమ ఉద్యోగులు వీరే..

సింగరేణి(కొత్తగూడెం): 11వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో పానుగంటి రాంబాబు, జనరల్ అసిస్టెంట్ జేవీఆర్ ఓసీ, జక్కుల గట్టయ్య (స్లాపింగ్ మజ్దూర్, ఆర్‌సీహెచ్‌పీ) ఉత్తమ కార్మికులుగా ఏరియా యాజమాన్యం ఎంపిక చేసింది. రాంబాబును ఈనెల 2న ప్రకాశం స్టేడియంలో సింగరేణి డైరెక్టర్ ఎస్.బలరామ్, గట్టయ్యను ఏరియా జీఎం శాలేంరాజు ప్రగతి వనంలో జరిగే వేడుకల్లో సన్మానించనున్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

ఇల్లెందురూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ ధన్‌సింగ్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని ఎస్ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అధికారులు, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

సింగరేణి సివిల్ జీఎం సూర్యనారాయణకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సుమారు 36 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన కార్పొరేట్ ఏరియా సివిల్ జీఎం టి.సూర్యనారాయణ ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు ఆదివారం 3 ఇంక్‌లైన్ బంగ్లోస్‌లో భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ ఆధ్వర్యంలో సూర్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఆంతోటి పాల్, కొప్పరి నవతన్, గుగులోత్ కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

జూలూరుపాడు: అనంతారం గ్రామానికి చెందిన మల్కం వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం వెంకటేశ్వర్లు దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యమిత్రులు హాజరై వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. వెంకటేశ్వర్లు భార్య పవిత్రకు రూ.5,000, ఇద్దరు కుమార్తెలకు రూ.60,000, 25 కిలోలు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మంగమూడి నాగేశ్వరరావు, కత్రం స్వామి, శీరంశెట్టి రామారావు, నారా శ్రీను, వేల్పుల గోపాలకృష్ణ, జోగారావు, కిషోర్, కృష్ణార్జునరావు, సతీష్, అనుమళ్ల శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల ప్రయోజనాలపై ఆలోచించండి..

ఇల్లెందు: అధికారంలోకి వచ్చే ముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 18 నెలలు గడిచినా ఏ ఒక్కటీ అమలు చేయలేదని టీయూసీఐ ఆరోపించింది. ఆదివారం ఇల్లెందులో జరిగిన ఆఫీసర్ బేరర్ల సమావేశంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... 11వ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్సవాలు జరుపుకోబోతుందని, కార్మికుల ప్రయోజనాల సమాలోచనలు చేయాలని కోరారు.

లక్ష్యం.. 2లక్షల మొక్కలు

- నర్సరీల్లో పండ్లు, పూలమొక్కలు సిద్ధం
- వర్షాలు పడగానే నాటేలా ప్రణాళిక

సుజాతనగర్: వన మహోత్సవానికి గ్రామాల్లో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో వర్షాలు పడగానే మొక్కలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు నాటేందుకు ఇప్పటికే ఎక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా అధికారులు తెలుసుకుంటున్నారు.

20 నర్సరీల ఏర్పాటు..

సుజాతనగర్ మండలంలో 20 గ్రామ పంచాయతీలుండగా అన్ని గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. వేసవి ప్రారంభంలోనే లక్ష్యాలను గుర్తించి నర్సరీల్లో బెడ్లు ఏర్పాటు చేశారు. మండలంలో ఒక్కో గ్రామ పంచాయతీకి 10 వేల మొక్కల చొప్పున 20 గ్రామ పంచాయతీల పరిధిలో 2 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. విత్తనాలు నాటడం, నీరు పెట్టడం, బ్యాగ్ ఫిల్లింగ్‌తో పాటు ఎండ నుంచి మొక్కలను రక్షించేందుకు గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేశారు.

పండ్లు, పూల మొక్కల పెంపకం..

మండలంలో నర్సరీల్లో గ్రామ విస్తీర్ణం, జనాభా ఆధారంగా మొక్కల పెంపకం సామర్థ్యాలను నిర్ధారించారు. ఒక్కో నర్సరీల్లో 10 నుంచి 20 వేల మొక్కలు పెంచుతున్నారు. ఇళ్లలో నాటేందుకు పండ్లు, పూల మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్, ప్రకృతి వనాల కోసం మరిన్ని రకాల



నిమ్మలగూడెంలో షేడ్ నెట్‌లో ఏర్పాటు చేసిన నర్సరీ

విత్తనాలను నాటినట్లు అధికారులు తెలిపారు.

షేడ్ నెట్‌తో సంరక్షణ... మొక్కలు ఎండిపోకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. షేడ్ నెట్లు ఏర్పాటు చేసి మొక్కలకు ఎండ తగలకుండా చేయడంతో పాటు ఉపాధి హామీ కూలీలతో నిత్యం నీటిని అందిచడంతో ఈసారి ప్రతీ మొక్క ఎండిపోకుండా కాపాడగలిగారు. నర్సరీల నిర్వహణ మొత్తం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు.

మొక్కలను సంరక్షించాలి...



ప్రతీసారి మొక్కలు నాటుతున్నారు కానీ వాటిని సంరక్షించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. నాటిన మొక్కల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. మొక్కలు నాటడమే కాకుండా ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించాలి.

– కాత్రాల తిరుపతిరావు, సింగభూపాలెం

లక్ష్యం మేరకు మొక్కల పెంపకం...



ప్రతీ గ్రామంలోని నర్సరీల్లో మొక్కలను పెంచాం. ఎండ, వడగాలులకు ఎండి పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఒక్క మొక్క కూడా ఎండిపోలేదు. వనమహోత్సవం నాటికి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మొక్కలు నాటడంపై అవగాహన కల్పిస్తాం.

– బి.భారతి, ఎంపీడీఓ, సుజాతనగర్

భక్తిశ్రద్ధలతో జాతర నిర్వహించుకోండి..

సుజాతనగర్: రాజకీయలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో అంకమ్మతల్లి జాతరను పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాఘవాపురం అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా గ్రామస్తులంతా సంతోషంగా వేడుక నిర్వహించుకోవాలని సూచించారు. చట్టం ముందు అందరూ సమానులేనని జాతరలో ఏదైనా వివాదం చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వివాదాలు సృష్టించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర బందోబస్తులో పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ రాఘవులు, వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

సొంతింటి పథకం అమలు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): 11వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి యాజమాన్యం కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని సీఐటీయూ కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కొద్ది సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ప్రతీఒక్కరికి సంత ఇల్లు ఉండాలనే అంశం మీద ఎన్నికల ప్రచారంలో ప్రసంగాలు చేసి సింగరేణి కార్మికులను నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. తెలంగాణలోని అతిపెద్ద సంస్థ సింగరేణి ఏడు జిల్లాలో విస్తరించి, రాష్ట్రానికి, దేశానికి వెలుగులు ఇస్తున్న సింగరేణి బిడ్డలైన కార్మికులు రిటైర్మెంట్ అయినా సొంతింటికి నోచుకోని పరిస్థితి ఉందని తెలిపారు. శనివారం కొత్తగూడెం ఏరియాకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి నోటి నుంచి ఈ వార్త వస్తుందని ఎంతో ఎదురు చూశామని, ఆ ఊసే లేకుండా వెళ్లడం విచారకరమని తెలిపారు. రేపటి ఆవిర్భావ వేడుకల్లోనైనా కార్మికుల సొంతింటి నిర్మాణానికి 250 గజాల ఇస్తున్నట్లు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): అనుమతిలేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బానోత్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. చిట్టిరామవరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. బడుగు, బలహీనవర్గాల పిల్లలకు 25 శాతం సీట్లను కేటాయించడం లేదన్నారు. సొంత భవనాలు, లైబ్రరీ, ఆటస్థలాలు లేకుండా విద్యాసంస్థలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుగులోత్ భాస్కర్, బోడ హరి, గుగులోత్ రాందేవ్, భానోత్ శంకర్, సామ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే నూతన ఓసీ పనులు ప్రారంభం

ఇల్లెందు: ఎట్టకేలకు ఇల్లెందులో నూతన ఓసీకి అన్ని అనుమతులు లభించాయని, వచ్చే వర్షాకాలం తర్వాత ఓసీలో బొగ్గు ఉత్పత్తి పనులు ప్రారంభం అవుతాయని ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. ఆదివారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... మే నెల ఉత్పత్తి ఉద్పాకత వివరాలు వెల్లడించారు. మే లో ఇల్లెందు ఏరియా లక్ష్యం 3.10 లక్షల టన్నులకు గానూ 2.71 లక్షల టన్నుల ఉత్పత్తి చేసి 87 శాతం సాధించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం 6.30 గంటలకు జెండా ఆవిష్కరణ, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, జగదాంబా సెంటర్ నుంచి సింగరేణి స్కూల్ గ్రౌండ్ వరకు తెలంగాణ రన్ ఏర్పాటు చేశారు. సాయంత్రం సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని జీఎం తెలిపారు. ఆటలపోటీల విజేతలకు బహుమతుల పంపిణీ ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న జీఎం కృష్ణయ్య

107శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో మే నెలలో కంపెనీ నిర్దేశించిన 12,56,731 లక్షల టన్నుల లక్ష్యానికి 13,49,079 లక్షల టన్నులు 107శాతం ఉత్పత్తి సాధించింది. ఏప్రిల్, మే నెలలో కంపెనీ నిర్దేశించిన 25,63,231 లక్షల టన్నుల లక్ష్యానికి 25,63,899 లక్షల టన్నులు 100శాతం సాధించినట్లు సింగరేణి గణాంకాల్లో తెలిపింది. ఈ మేరకు రోజుకు ఏరియాలోని రెండు ఓసీలు, ఒక భూగర్భ గనిలో 50 వేల టన్నులు ఉత్పత్తి జరుగుతోంది. అదేవిధంగా మే నెలలో 13.05 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు సింగరేణి అధికారులు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

టేకులపల్లి: టేకులపల్లి తహసీల్దార్‌గా లంకపల్లి వీరభద్రం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ముత్తయ్య ఉద్యోగ విరమణ పొందారు.

మావోయిస్టులను చర్చలకు పిలవండి..

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలో ఆపరేషన్ కగార్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేత వాంకుడోత్ మోతీలాల్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నక్సలైట్లను తుదముట్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణహోమాన్ని తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. శాంతిచర్చలకు సిద్ధంగా ఉన్న మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలకు పిలవాలని కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని విరమించుకోవాలని, జూలై 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఇల్లెందులో జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కార్మికుల జీవితాలను పణంగా పెడుతోందన్నారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ రాసుద్దీన్, కొండపల్లి శ్రీనివాస్, తోడేటి నాగేశ్వరరావు, గౌని నాగేశ్వరరావు, డి.ప్రసాద్, కొప్పుల శ్రీనివాస్, యాసారపు వెంకన్న, గడ్డం నాగేష్, మంకెన వెంకటేశ్వర్లు, వాసు, అంజయ్య, ఉపేందర్, పామేల్, నర్సింహారావు, రమేష్, మంగీలాల్ పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పుస్తకాల పురుగులుగా మారుతున్నారని, అలా కాకుండా సాంస్కృతిక, క్రీడల్లో రాణించినప్పుడే వారు మానసిక ఉల్లాసంగా ఉంటారని జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో రైసింగ్ స్టార్ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి సూపర్ డాన్స్ సీజన్-2 పోటీలకు ముఖ్య అతిథిగా కామేష్ హాజరై డాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడారు. న్యాయనిర్ణేతలుగా రచ్చ మధు, కడారి వెంకట్, భద్రాచలం శ్యామ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ జ్యోతి, రామకృష్ణ, గంధం మల్లికార్జునరావు, కొప్పుల యశ్వంత్, రుక్మెందర్ బండారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

పాల్వంచరూరల్: నిరుపేద, మధ్య తరగతి ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వారికి అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. సోములగూడెం గ్రామంలో ఆదివారం సీపీఐ గ్రామశాఖ మహాసభ ఎం.మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామశాఖ నూతన కమిటీ కార్యదర్శిగా బాలినేని లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా జమ్ముల సత్యనారాయణ, మరో 11మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న విశ్వనాథం

వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, గుండాల నాగరాజు, వైఎస్ గిరి, ఎరుకల వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, వీరమ్మ, తేనె ప్రసాద్, పుప్పాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ

ఇల్లెందురూరల్: వరుసగా మూడు నెలల రేషన్ బియ్యంను జూన్‌లోనే పంపిణీ చేస్తున్నట్లు సివిల్ సప్లయిస్ డీటీ పాషా తెలిపారు. మండలంలో ఆదివారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైందని, జూన్ 30వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తుగా బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. ఇదిలా ఉండగా తొలిరోజే వినియోగదారులు భారీ సంఖ్యలో రావడంతో రేషన్‌షాపుల వద్ద రద్దీ నెలకొంది. దీంతో పలు రేషన్‌షాపుల వద్ద రాత్రి వరకు డీలర్లు పంపిణీ చేశారు.

సర్వజన ఆస్పత్రిలో పారిశుద్ధ్య సమస్య



క్రిటికల్ కేర్ వార్డు పక్కన ఆస్పత్రి వ్యర్థాలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో సమస్యలు తిష్టవేయడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో ఉపయోగించిన సిరంజీలు ఆస్పత్రి ఆవరణలోనే వేస్తున్నారు. ఆస్పత్రి వచ్చిన చిన్న పిల్లలు వాటితో ఆడుకుంటున్నారు. ప్రమాదం, వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కరోనా కొత్త వేరియంట్ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. వినియోగించిన సిరంజీలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ వార్డు పక్కన, ఆస్పత్రిలో వినియోగించిన గ్లౌజులు, గ్లూకోజ్ బాటిల్స్, సిరంజీలు, ఆపరేషన్స్‌కు వినియోగించిన తదితరములు కూడా కుప్పకుప్పలుగా నిల్వ ఉంచుతున్నారు. దీంతో వార్డులో చికిత్స పొందేవారు, వారితో వచ్చిన బంధువులు దుర్వాసనకు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

అలంకారంగా వీధి దీపం.. కూడలి అంధకారం



సుభాష్‌నగర్ కూడలిలో ఎత్తుగా ఏర్పాటు చేసిన లైటింగ్ స్తంభం



స్తంభంలో కింది భాగంలో బిగించిన లైట్లు

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ కూడలి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు డీఎంఎఫ్‌టీ పథకంలో భాగంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కూడలిలో స్తంభం ఏర్పాటు చేసి హైమాస్ లైట్లను బిగించారు. కానీ వాటిని నేలమీద సాము చేసేలా బిగించి వదిలేశారు. విద్యుత్ కనెక్షన్ జాప్యంతో అలంకారప్రాయంగా మిగిలిపోయింది. కూడలిని అంధకారంలో నిలిపింది. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికుల సందడితో ఉండే కూడలి నెలల తరబడి అంధకారంలో మగ్గుతున్నా ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ రాజును వివరణ కోరగా... నిర్మాణం పూర్తి చేశామని, విద్యుత్ కనెక్షన్ త్వరలో ఇస్తామని చెప్పారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా యూటర్న్‌లు

సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డివైడర్ల మధ్య నాటిన మొక్కలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఎత్తుగా, ఏపుగా పెరిగిన చెట్లు యూటర్న్ తీసుకునే సమయంలో అటువైపు నుంచి వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వాహనదారులు వాపోతున్నారు. - సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి: చెన్నకేశవరావు, పంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్: 97037 75478

స్థలాల గుర్తింపే సమస్య



ప్రభుత్వాస్పత్రికి కేటాయించిన స్థలం



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే కనకయ్య, జీఎం కృష్ణయ్య (ఫైల్)

- ఇల్లెందుకు ఐటీఐ, ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజూరు
- 30 ఎకరాల స్థలం గుర్తింపునకు కుస్తీ
- ఆస్పత్రికి ఐదెకరాలు ఖరారు

ఇల్లెందు: ఆ భవనాల నిర్మాణం పూర్తయితే ఇల్లెందు రూపురేఖలు మారతాయి. ఇంటిగ్రేటెడ్ గురుకులం కోసం 25ఎకరాల స్థలం కేటాయింపుకు కుస్తీ పడుతున్నారు. ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. ఇల్లెందు ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని తొలివిడతలో మంజూరు చేసింది. కానీ స్థలం కేటాయింపు జఠిలంగా మారింది.

ప్రభుత్వ ఐటీఐకు ఐదు ఎకరాలు కేటాయింపు కూడా కష్టమేనంటున్నారు. ఇక పట్టణ నడిబొడ్డున జేకే బస్టాఫ్ వద్ద రూ.37 కోట్లతో ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయింపు ఓ కొలిక్కి వచ్చింది. రేపోమాపో అక్కడ పనులు ప్రారంభం అయ్యే మార్గం సుగమం అయింది. ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో నిర్మించతలపెట్టిన 100 పడకల ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ ఐటీఐ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం 35ఎకరాల స్థలం కావాలి. అందులో హాస్పిటల్‌కు మాత్రమే ఐదెకరాల ఎకరాలు కేటాయింపు పూర్తయింది. ఐటీఐ, గురుకులానికి స్థలం లేక సతమతమవుతున్నారు.

ప్రతిష్టాత్మక భవనాలకు..

పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ నుంచి ఉప్పిడి మిల్లు వరకు సుమారు అర కిలోమీటర్ పొడవునా సింగరేణి క్వార్టర్లు ఉన్నాయి. ఇందులో అవసరాలను బట్టి ప్రభుత్వం ఆయా విభాగాలకు స్థలాలను తీసుకుంటుంది. ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మాణానికి స్థలం తీసుకుంది. నాలుగేళ్ల క్రితం గ్రంథాలయానికి, వెజ్ – నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం కూడా కొంత స్థలం తీసుకుంది. తాజాగా ప్రభుత్వ హాస్పిటల్, ప్రభుత్వ ఐటీఐల కోసం 10 ఎకరాల స్థలం రోడ్డు వెంట తీసుకుంటుంది. దీంతో బీబీఆర్ ఉప్పిడి మిల్లు నుంచి జేకే బస్టాఫ్ వరకు ఐటీఐ, గ్రంథాలయం, ప్రభుత్వ హాస్పిటల్ ఉండబోతున్నాయి.

ఇంటిగ్రేటెడ్ గురుకులానికి చిక్కుముడి..

ఇంటిగ్రేటెడ్ గురుకులానికి చిక్కుముడి వచ్చింది. సింగరేణి బైపాస్ ఖమ్మం – మహబూబాబాద్ రోడ్‌లో స్థలం ఎంపిక చేశారు. దీంతో కొంతమంది రైతులు కోర్టును ఆశ్రయించారు. స్థలానికి కోర్టు కేసు చిక్కుముడిగా మారింది. 25 ఎకరాల స్థలం ఇక్కడ కేటాయించాల్సి ఉంది.

ఇంటిగ్రేటెడ్ గురుకులం కూడా ప్రభుత్వ హాస్పిటల్ నుంచి జేకే సమ్మక్క గద్దెల ఆర్చి వరకు ఇందిరానగర్ రోడ్డు వెంబడి నిర్మాణం చేస్తే పట్టణానికి ఆకర్షణగా నిలుస్తుందంటున్నారు.